# సూర్య

www.suryaa.com

రంగారెడ్డి-వికారాబాద్ మేడ్చల్

మంగళవారం 21 మే 2024

పేజీలు : 9


# ఇకపై 'టీఎస్' కు బదులుగా 'టీజీ'



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మే 20): తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్ కు బదులుగా టీజీ గా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

3 లో

# రైతు వేదికలకు అందని నిధులు..!

- ఏడాదిగా కొరవడిన నిర్వహణ
- నెలకు రూ.9వేలు రాని వైనం
- నిరుపయోగమవుతున్న వేదికలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ఏఈవోలు




మంచాల, మేజర్ న్యూస్ (మే 20) : మండలంలో రైతు వేదికలు నిరుపయోగమవుతున్నాయి. ఏఈవోలు అందుబాటులో ఉండి రైతులకు సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం వీటిని నిర్మించింది. మండలంలో 23 గ్రామ పం చాయతీల్లోని 03 క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మిం చేందుకు ప్రభుత్వం ఒక్కోదానికి రూ.22 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులతో వేదికలు నిర్మించి 2021 నుంచి అందుబాటులోకి తెచ్చింది. కానీ, వీటి నిర్వహణకు నిధులు సకాలంలో విడుదల చేయడం లేదు. దీంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్యం, ఇతర నిర్వహణ ఖర్చులు భారంగా మారాయని వారు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

★ ఏడాదిగా అందని నిధులు :

ఒక్కో రైతువేదిక నిర్వహణకు నెలకు రూ.9వేల చొప్పున ఖర్చు అవుతుందని గత ప్రభుత్వం అంచనా వేసింది. వాటిలో విద్యుత్ బిల్లులకు రూ. వెయ్యి, రైతుల శిక్షణకు రూ.2.500, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.3వేలు, తాగునీటికి రూ.500 మరమ్మతు, స్టేషనరీ, ఇతర ఖర్చులకు రూ.2వేలు వెచ్చించాల్సి ఉంది. ఈ మేరకు రైతువేదికలకు గతేడాది ఏప్రిల్ వరకు నిధులు విడు దలయ్యాయి. అప్పటి నుంచి నిధులు నిలిచి పోవడంతో రైతువేదికల నిర్వహణ భారంగా మారిందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించడం తలకు మించిన భార మైందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న రైతు వేదికల నిర్వహణ నిధులు త్వరగా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

## చింతల చెరువుకు చింత తప్పదా ?

- రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం-చెరువుకు శాపం
- ధ్వంసమైన పెద్దకత్వ కాల్వ పునరుద్ధరణ పనులు ఎప్పుడో ?
- ఈ యేడు వరద నీరు రాక ఎండిపోనున్న చెరువు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అడుగంటనున్న భూగర్భ జలాలు
- అధికారుల పర్యవేక్షణ శూన్యం రైతన్నలకు తప్పని వ్యధ
- ముందస్తు చర్యలు చేపట్టని రోడ్డు నిర్మాణాదారులు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- ప్రశ్నార్ధకంగా మారన్ను చెరువు ఉనికి



అబ్దుల్లాపూర్‌మెట్, మేజర్‌న్యూస్ (మే 20) : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు అబ్దుల్లాపూర్‌మెట్ చింతల చెరువుకు శాపంగా మారాయి. నిర్మాణ పనుల్లో భాగంగా ఎగువన ఉన్న పెద్దఅంబర్‌పేట పెద్దకత్వ నుంచి ఈ చెరువులోకి వచ్చే వరద కాల్వ పూర్తిగా ధ్వంసం అయ్యింది మిగతా 2లో

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు గిరిజన బాల బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానం

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



3 లో

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (మే 20): బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలో చదువుకునేందుకు గిరిజన బాల బాలికలు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు.

# 'వైద్యం' పేరుతో వ్యాపారం....

- వికారాబాద్‌లో అరకొర అనుమతులతో విచ్చలవిడిగా కొనసాగుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం
- ఒకటికి రెండ్డింతల బిల్లులు వేసి ప్రజలను నిలువునా దోపిడి చేస్తున్న వైనం
- కనిపించని డిఎం- ఎచ్ఓ పల్వాన్ కుమార్ పర్యవేక్షణ..!
- ఆసుపత్రి నిర్వహకులు కనుసన్నలోనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు
- జిల్లా వైద్య శాఖపై అనేక ఆరోపణలు







వికారాబాద్ మేజర్ న్యూస్ (మే 20): వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రులు రోజు రోజుకు పుట్టగొడుల్లా వెలుస్తున్నాయి. అరకొర అనుమతులతో నిర్వహకులు ఆసుపత్రులను కొనసాగిస్తున్నారు. దీంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తుంది. మిగతా 2లో

# చింతల చెరువుకు చింత తప్పదా ?







**మొదటిపేజీ తరువాయి...** ద్వంసం అయిన వరద కాల్వను అసంపూర్తిగా పునరుద్దరించడంతో ఈ యేడు చెరువులోకి వర్షపు నీరు వచ్చే అవకాశం లేదు. వర్షాకాలం సమీపిస్తున్న వరద కాల్వకు పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఈ యేడు చింతల చెరువు ఉనికి ప్రశ్నార్థకంగా మారనుంది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఈ కాల్వను సదరు రోడ్డు నిర్మాణదారులు రోడ్డు విస్తరణలో భాగంగా పూర్తిగా తొలగించారు. రోడ్డుకు ఒక వైపు ఉన్న సర్వీస్ రోడ్డు నుంచి ప్రధాన రోడ్డు వరకు మాత్రమే కింద నుంచి బాక్స్ కల్వర్టు నిర్మాణం చేపట్టి వదిలేశారు. రెండో పక్క ఉన్న సర్వీస్ రోడ్డు పై ఇప్పటి వరకు ఎలాంటి కల్వర్టు నిర్మాణం చేపట్టకుండా రోడ్డును వేశారు. దీంతో చుక్క నీరు కూడ చెరువులోకి వచ్చే అవకాశం లేకుండా పోయింది. రోడ్డు పక్క నుంచే ఉన్న ఈ కాల్వను పూర్తిగా ద్వంసం చేసి నెలలు గడుస్తున్న నేటి వరకు కూడ పున:రుద్దరణ పనులు చేపట్టకపోవడం శోఛనీయం. నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం వల్లనే చింతల చెరువు ఈ సంవత్సరం పూర్తిగా ఎండిపోక తప్పదు. సమీపిస్తున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కల్వర్టు నిర్మాణ పనులు ముందుగా పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల చెరువు ప్రమాదంలో పడనుంది. రోడ్డు విస్తరణ పనుల్లో ద్వంసం అయిన చింతల చెరువు పెద్దకత్వ కాల్వలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఒక్క నాడు కూడ చూసిన పాపాన పోలేదు. అధికారులు పర్యవేక్షణ లోపంతో చెరువు ఉనికి ప్రమాదంలో పడింది. చింతల చెరువులకు ప్రధానమైన వరద కాల్వ కావడంతో కల్వర్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకొని ఉంటే వర్షపు నీరు చెరువులోకి చేరే అవకాశం ఉండేది. అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే నిర్మాణ పనులు నత్తనడకను సాగుతూ చెరువుకు శాపంగా మారాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే చెరువులో నీరు అడుగంటడంతో గ్రామంలో బోరు బావులు వెలవెల బోతున్నాయిని, చెరువు పూర్తిగా ఎండిపోతే ఈ యేడు నీటి కష్టాలు తప్పవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పోలీసు స్టేషన్ సమీపంలో ద్వంసం అయిన పెద్దకత్వ కాల్వను యుద్ద ప్రాతిపదికన పున:రుద్దరించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

## అధికారుల పర్యవేక్షణ లోపమే చెరువుకు శాపంగా మారింది

చెరుకు కిరణ్ కుమార్ గౌడ్ (తాజా మాజీ సర్పంచ్-అబ్దుల్లాపూర్‌మెట్)



పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు పనులు ప్రారంభమైన మొదట్లోనే సంబంధిత కాంట్రాక్టర్‌ను కలిసి రోడ్డు విస్తరణలో తొలగించనున్న పెద్దకత్వ వరద కాల్వ పై చర్చించడం జరిగింది. ఈ విషయాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు దృష్టికి సైతం తీసుకెళ్లాము. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి ద్వంసం అయిన వరద కాల్వను పున:రుద్దరిస్తామని హామి ఇచ్చాకే రోడ్డు పనులు ప్రారంభించేందుకు అంగీకరించడం జరిగింది. కేవలం అధికారుల పర్యవేక్షణ లోపంతోనే చెరవు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం సమీపిస్తున్న నేటి వరకు కూడ కల్వర్టు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండంతో చెరువులోకి చుక్క నీరు చేరే అవకాశం లేదు. దీంతో గ్రామంలో భూగర్భ జలాలు మరింత అడుగంటి నీటి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందించి సాధ్యమైనంత త్వరగా ఈ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో పునరుద్దరించాలి లేదంటే గ్రామస్తులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులు జరగకుండా అడ్డుకుంటాము.

# కొబ్బరి నీరు వేసవిలో మానసిక, శారీరక ఉల్లాసం

హైదరాబాద్ మెజర్ న్యూస్ : మండే వేసవి వచ్చింది, అందుకే ఇది ఆర్ద్రీకరణ (హైడ్రేషన్)కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం. సరైన హైడ్రేషన్ అనేది మొత్తం ఆరోగ్యం, ఇంకా శక్తిని కాపాడుకోవడంలో కీలకమైన అంశం అని డా. భావనా శర్మ, హెడ్ - న్యూట్రిషన్ సైన్స్, ఐటిసి లిమిటెడ్, బి నేచురల్ మాట్లాడుతూ తేమతో కూడిన నెలల్లో ఇది మరింత కీలకం. నిర్జలీకరణం(డీహైడ్రేషన్)తో అలసట, మైకము, తలనొప్పులు ఇంకా మానసిక బలహీనత వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. వాస్తవానికి, తేలికపాటి నిర్జలీకరణం కూడా మానసిక పనితీరును గణనీయంగా ప్రభావితం చేస్తుందని, జ్ఞాపకశక్తి, శ్రద్ధ ఇంకా మనో పరిస్థితిని ప్రభావితం చేస్తుందని పరిశోధనలో తేలింది. అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ఇండియా (అసోచామ్) అందించిన ఇటీవలి నివేదికలు పెరుగుతున్న ఆందోళనను ప్రస్ఫుటంగా వెల్లడిస్తున్నాయి. భారతీయ శ్రామికశక్తిలో గణనీయమైన భాగం నిర్జలీకరణ-ప్రేరిత అలసటను అనుభవిస్తోందని, ఇది ఉత్పాదకత తగ్గడానికి దారితీస్తుందని అసోచామ్ నివేదిక తెలియజేసింది. ఇది కేవలం పని గురించి మాత్రమే కాదు; నిర్జలీకరణం అనేది మీ వ్యాయామాలు, దృాఎష్టి మరియు మొత్తం శ్రేయస్సుపై ప్రభావం చూపుతుంది. సిఫార్సు చేసిన రోజువారీ ద్రవం, పురుషులకు 3000 మి.లీ. మరియు స్త్రీలకు 2200 మి.లీ కాగా, ఇది తగినంత స్థాయి కంటే ఎక్కువ.ఆర్ద్రీకరణ అందించే ఆహారాలు మరియు పానీయాలను ఒక మనిషి దినచర్యలో చేర్చడం ద్వారా శరీరం తేమగా, నీటితో ఉండటానికి ఉత్తమ మార్గాలలో ఒకటి. లస్సీ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు వంటి సాంప్రదాయ భారతీయ పానీయాలు రుచికరమైనవి మాత్రమే కాకుండా ఎంతో ఎక్కువ నీటిని కలిగి ఉంటాయి. అన్నింటిలోనూ, లేత కొబ్బరి నీరు చాలా సహజమైన ఆర్ద్రీకరణ, తాజాదనం అందించే పానీయాలలో ఒకటి. పొటాషియం, సోడియం వంటి సహజమైన ముఖ్యమైన ఖనిజాలు సమృాఎద్ధిగా ఉండటం వలన ఇది తక్షణమే శక్తిని పెంచుతుంది, అలాగే చెమట నుండి కోల్పోయిన ఎలక్ట్రోలైట్లను తిరిగి నింపడంలో సహాయపడుతుంది. లేత కొబ్బరి నీళ్లతో ఇతర ప్రయోజనాలు ఏమిటంటే, ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది, రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది, చర్మం ఇంకా జుట్టు అలాగే ఇతర శరీర అవయవాలపై గొప్ప ప్రభావం చూపుతుంది. అదనంగా, దానిలో ఉండే సహజమైన తీపి, చక్కెర పానీయాలకు సరైన ప్రత్యామ్నాయంగా చేస్తుంది.రోజులో ఎప్పుడైనా సరే లేత కొబ్బరి నీళ్ళు తాగవచ్చు; అయితే, ఉదయం లేదా వ్యాయమం తర్వాత దీనిని తాగాలని సిఫార్సు చేయబడింది. దీనిని అన్ని వయస్సుల వ్యక్తులతో పాటు పిల్లలు కూడా తీసుకోవచ్చు. ఎక్కువ పొటాషియం స్థాయిలు లేదా ఏవైనా గుర్తించిన మూత్రపిండ సమస్యలు ఉన్న వ్యక్తులు మాత్రమే అదనపు కొబ్బరి నీటిని తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేత కొబ్బరి నీళ్ల అసలు రూపానికి ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు, అందుకే నేడు బి నేచురల్ వంటి బ్రాండ్లు అనుకూలమైన పెట్ బాటిళ్లలో ప్యాక్ చేసిన లేత కొబ్బరి నీటిని అందిస్తున్నాయి. చక్కెర అసలు ఏమాత్రం జోడించకుండా, కృాఎత్రిమ రుచి లేకుండా ఉండే ఇవి, ప్రయాణంలో తీసుకెళ్లడానికి సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉంటాయి. సరైన ఆర్ద్రీకరణ అనేది సరైన మానసిక, శారీరక పనితీరుకు మూలస్తంభంగా నిలుస్తుంది, ప్రత్యేకించి మనం వేసవి నెలల్లో ఉన్నప్పుడు ఇది చాలా ముఖ్యం. వైవిధ్యభరిత సమతుల్య ఆహారంలో భాగంగా లేత కొబ్బరి నీటిని చేర్చడం ద్వారా, రోజంతా శరీరం నీటితోను, అలాగే శక్తివంతంగా ఉండేలా చూసుకోవచ్చు.

# 'వైద్యం' పేరుతో వ్యాపారం...

**మొదటిపేజీ తరువాయి...** వికారాబాద్‌లో నూతన ఆసుపత్రులు వెలువడం హర్షించదగ్గ విషయమే... కాని ఆ ఆసుపత్రి నిర్వహకులు చిన్న జబ్బుకైనా.. ఒకటికి రెడ్డింతలు (లక్షల్లో) బిల్లులు వేసి పేద ప్రజల నడ్డీ విరుస్తున్నారు. వికారాబాద్ పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఇంకా ప్రారంభానికి నోచుకోలేకపోవడంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్ వెళ్తూ ఉంటారు. కొందరు వికారాబాద్‌లోనే రెండు మూడు పెద్ద ఆసుపత్రుల్లో అత్యవసర సమయాల్లో చికిత్స కోసం అడ్మిట్ అవుతుంటారు. ఇదే అదునుగా భావించి పట్టణంలోని రెండు మూడు ఆసుపత్రుల నిర్వహకులు ఇష్టానుసారంగా బిల్లులు వేసి ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గతకొన్ని రోజుల క్రితం పట్టణంలో ప్రారంభమైన ఆసుపత్రులు నిలువున దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ ఆసుపత్రిలో అధునాత మిషన్‌లతో పాటు అన్ని వసతులు ఉన్నాయంటూ ప్రజలను మభ్యపెట్టి.. గ్రామాలలో వారి స్వలాభం కోసం ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేసి ప్రజలకు వల వేస్తున్నారు. వారి మాటలు ప్రజలు నమ్మి చిన్నపాటి జ్వరం, సీజనల్ వ్యాధులు, ఇతర ఇబ్బందుల వల్ల ఆసుపత్రికి వెళితే చాలు వారి జేబులకు చిల్లులు పడినట్లే. జబ్బు విషయమై ఎవరైనా ఆసుపత్రికి వస్తే కేవలం ఆ జబ్బుకు సంబందించిన టెస్టులు మాత్రమే చాయవాల్సి ఉంటుంది. కాని ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం అవసరం లేని టెస్టులు కూడా చేసి వారి నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఎక్కడ చూసినా ఇదే ప్రచారం జరుగుతుంది. సాధారణంగా వికారాబాద్ పరిసర ప్రాంతాలలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ ఉండడంతో వారికి వైద్యం పై ఎలాంటి అవగాహన లేకపోవడంతో ఆసుపత్రిని నిర్వహకులు అదే అదునుగా భావించి వారిని బిల్లులతో నిండా ముంచుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ప్రైవేట్‌లో సిజరిన్‌లకే ప్రాధాన్యత..!**

రాష్ట్రం ప్రభుత్వం గర్బిణీలకు సాధారణ డెలవరీలకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహకులు అవేవి పెట్టించుకోకుండా సీజరిన్‌లే ఎక్కువ చేసి డబ్బులను దండుకుంటున్నారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మినహా మిగితా ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్బిణీలకు ఎక్కువ మొత్తంలో సిజరిన్‌లు చేస్తున్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. సీజరిన్‌లు చేస్తే ఎక్కువ మొత్తంలో బిల్లులు వేసేందుకు వీలు ఉంటుందనే నెపంతో ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు ప్రజలు మండిపడుతున్నారు. డబ్బు సంపాధనే లక్ష్యంగా ఆసుపత్రుల యజమాన్యం ఒకటికి రెండింతలు బిల్లులు వేసి ప్రజల నడ్డి విరుస్తున్నట్లు తెలుస్తుంది.

**ఆసుపత్రుల్లో ప్రాణాలు పోతే.. నష్ట పరిహారం...!**

వికారాబాద్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యుల నిర్లక్ష్యానికి పేషెంట్‌ల ప్రాణాలు కోల్పోతే ఆ ప్రాణానికి వేలం వేస్తున్నారు. ఈ మధ్య కాంలో వికారాబాద్‌లో ఇలాంటి సంఘటనలు చాలానే జరిగాయి. పట్టణంలోని ఎమ్మార్పీ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఒ పెద్ద ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి అమాయక ప్రజల ప్రాణాలు పోతుంటాయి. ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకునే సమయంలో కమ్మని తియ్యని మాటలు చెప్పి రోగులను అడ్మిట్ చేసుకుంటారు. అడ్మిట్ చేసుకున్న తరువాత అరకొర వైద్యం చేసి బిల్లులు లక్షల్లో దండుకుంటారు. ఒక వేళ వైద్యం వికటించి రోగి ప్రాణాలు కోల్పోతే ఆసుపత్రి నిర్వహకులు బాధితులతో కాలబేరానికి దిగుతారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు రహస్యంగా ఎంతో కొంత మృతుని కుటుంబ సభ్యులకు ఇచ్చి ఈ విషయాన్ని బయటికి రాకుండా జాగ్రత్త పడతారు. ఇలాంటి సంఘటనలు వికారాబాద్‌లో జరగడం సర్వ సాధారణం. ఇలా ఎన్నో జరుగుతున్నప్పటికి ఆసుపత్రిపై జిల్లా వైద్య శాఖ అధికారులు ఎలాంటి చర్యలకు పూనుకున్న పాపాన పోలేదు. ఇలా ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం ధర్జాగా వైద్యం పేరుతో వ్యాపారం చేసి తమను నిండా ముంచుతున్నారని ప్రజలు ఎన్నో సార్లు తమ ఆవేధన వ్యక్తం చేశారు.

**కనిపించని డిఎం- ఎచ్ఓ పల్వాన్ కుమార్ పర్యవేక్షణ**

వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రజలను నిలువునా దోపిడి చేస్తున్నప్పటికీ... డిఎం అండ్ ఎచ్ఓ పల్వాన్ కుమార్ పర్యవేక్షణ కనిపించకపోవడం విడ్డూరం. అరకొర అనుమతులతో అడ్డగోలిగా కొనసాగించే ఆసుపత్రులపై జిల్లా అధికారి దృష్టి పెట్టకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహకులు కొన్ని ప్రభుత్వ నియమనిబంధనలకు లోబడి వారు వైద్యం చేయవాల్సి ఉంటుంది. మున్సిపల్ నమోదు, డ్రగ్స్ వాడకానికి గుర్తింపు, బయో మెడికల్ వేస్టేజ్, ఎంటిపి, పిఎండిటి యాక్టు 1994 చట్టానికి లోబడి, మరెన్నో ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ఆసుపత్రిని కొనసాగించాల్సి ఉంటుంది. కాని జిల్లా కేంద్రంలో ఎలాంటి గైడ్‌లైన్స్ పాటించకుండా వైద్యం పేరుతో ప్రజల నుండి దోపిడికి పాల్పడుతున్న ఆసుపత్రులపై జిల్లా వైద్య అధికారుల నిఘా లేకపోవడంతో ప్రజలు వారిపై పలు అనుమానాలకు వ్యక్తం చేస్తున్నారు.

# బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలకు గిరిజన బాల బాలికల నుండి ధరఖాస్తులు ఆహ్వానం

● జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (మే 20)ః బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలో చదువుకునేందుకు గిరిజన బాల బాలికలు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లాలో చదువుచున్న జిల్లా వాస్తవ్యులైన గిరిజన బాల బాలికల నుండి 2024-25 విధ్యా సంవత్సరమునకు బెస్ట్ అవైలేబుల్ 3, 5, 8వ తరగతులలో ప్రవేశాలకై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 64 సీట్లు ఖాళీలు వుండగా 3వ తరగతిలో 32 కు లంబాడ బాలురు 18, బాలికలు 11, చెంచుకు 3 ఖాళీలుండగా బాలురు 1, బాలికలు 2కి అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఐదవ తరగతిలో 16 ఖాళీలు ఉండగా 10 లంబాడా బాలురకు, 04 బాలికలకు, చెంచులకు 2 వుండగా ఇందులో ఇందులో బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా 8వ తరగతి లో 16 ఖాళ్లిలో లంబాడ బాలురు 11, బాలికలు 4 ఖాళీళ్లుండగా ఒక చెంచు బాలికకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈ సదవకాశమును సద్వినియోగము చేసుకోవాలని తెలిపారు. ఒక కుటుంబం నుండి ఒక విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయము లక్షా 50 వేల



రూపాయల లోపు గ్రామీణ ప్రాంతములలో నివసించే వారికి అదేవిధంగా పట్టణ ప్రాంతములలో నివసించే వారికి 2 లక్షల రూపాయలలోపు వార్షిక ఆదాయం కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. కుల, ఆదాయ, నివాసము, ఆధార్ కార్డు, పుట్టిన తేది సర్టిఫికెట్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనాఫైడ్ తో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో దరఖాస్తు సమర్పించాలని ఆయన తెలిపారు. మే 21 నుండి జూన్ 6 వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తుల పొంది జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయ పరిధిలో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు.

జూన్ 12వ తేదీన లాటరీ విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని, ఎంపికైన విద్యార్థుల జాబితా జూన్ 13న జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ప్రదర్శించబడుతుందని ఆయన తెలిపారు. పాఠశాలలో ప్రవేశానికి అవకాశం వచ్చిన వారు జూన్ 14న విద్యార్థులు పాఠశాల యందు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఏదేని సమాచార నిమిత్తం 9948663053 ను సంప్రదించవలసినదిగా ఆయన పేర్కొన్నారు.

# ఇకపై 'టీఎస్'కు బదులుగా 'టీజీ'

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (మే 20)ః తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిఓలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్ లలో టీజీ గా ఉండాలని, ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ఆటనామస్ విభాగాలన్నీ దీనిని పాటించాలని ఆదేశించారు. తెలంగాణ ఇప్పటివరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైన టీజీ నిబంధన ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అధికారిక వ్యవహారాల కు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు ఇకపైన 'టీఎస్' అబ్రివేషన్ స్థానంలో అధికారికంగా 'టీజీ' అని మార్చుకునేలా ఈనెల 30వ తేదీన డెడ్ లైన్‌గా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటికి ఇది వర్తిస్తుందన్నారు. వెబ్‌సైట్ల తో పాటు అన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, రిపోర్టుల్లో ఇకపైన 'టీజీ' పదాన్నే (అబ్రివేషన్) వినియోగించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 'టీజీ' అనే అబ్రివేషన్‌ను అధికారికంగా గుర్తించడంతో ఈ మార్పును అన్ని విభాగాలు అమల్లోకి తెచ్చేలా ఆయా డిపార్టమెంట్ల కార్యదర్శులు, హెచ్‌ఓడీలు పర్యవేక్షించాలని సీఎస్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. 'టీజీ' అనే అబ్రివేషన్‌ను ఇకపైన అధికారికంగా వినియోగించాలని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తి కలిగిన (అటానమస్)



సంస్థలు ఈ మార్పును కార్యాచరణలో పెట్టాలని, అధికారులు వాడే లెటర్ హెడ్స్, రిపోర్టులు, నోటిఫికేషన్ లు, నేమ్ బోర్డులు, వెబ్‌సైట్‌లు, ఇతర అన్ని రకాల వినియోగం లో ఈ మార్పును చేపట్టాలని స్పష్టం చేశారన్నారు. దీంతో ఇప్పటివరకూ టీఎస్పీఎస్సీ (తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), టీఎస్ఆర్టీసీ (తెలంగాణ స్టేట్ ఆర్‌టీసీ) తదితర పేర్లతో కొనసాగుతున్న సంస్థలు ఇకపైన టీజీపీఎస్సీ, టీజీ ఆర్టీసీ అని మార్చుకోవాలని అన్నారు. ప్రభుత్వ వివిధ శాఖలు, విభాగాల మధ్య జరిగే అంతర్గత కరస్పాండెన్స్ (ప్రత్యుత్తరాలు)తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారంలోనూ 'టీజీ' అనే అబ్రివేషన్‌నే వినియోగించాలని సూచించారు. అన్ని శాఖలు, విభాగాలు ఈ మార్పులు చేపట్టిన అంశంపై ఆయా శాఖల కార్యదర్శులు ఈ నెల 30 వ తేదీ లోగా సాధారణ పరిపాలన శాఖ జాయింట్ సెక్రటరీ (కోఆర్డినేషన్)కు రాతపూర్వకంగా (యాక్షన్ టేకెన్ రిపోర్టు) తెలియజేయాలని సీఎస్ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాల్లో టీఎస్ కు బదులు టీజీ గామార్చి ఈ నెల 26వ తేదీ లోగా నివేదికలు సమర్పించాలని శాఖల అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ ఆదేశించారు.

## మీ సేవ ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలు ఇక సులభతరం

### మీ సేవ కమీషనర్ రవి కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న సేవ కమీషనర్ రవి కిరణ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ,మేజర్ న్యూస్ (మే 20)ః మీసేవల ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలను సులభతరంగా జారీ చేయడానికి అవసరమైన మార్పులు చేయడం జరుగుతుందని మీ సేవ కమిషనర్ రవి కిరణ్ అన్నారు. సోమవారం రోజున మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మీ సేవ కమిషనర్ రవి కిరణ్, జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ, అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. ప్రతి మండల పరిధిలోమీ సేవ ద్వారా జారీ చేసే వివిధ ధ్రువపత్రాలు జారీ చేసే ప్రక్రియలో ఏర్పడుతున్న ఇబ్బందుల విషయంలో కొన్ని సమస్యలను మండల తహసీల్దార్ లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మీ సేవ ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలు సులభతరంగా జారీ చేయడానికి మార్పులు,చేర్పులు చేయడం జరుగుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ హరిప్రియ, మండల తహసీల్దార్ లు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తాండూరు ప్రాంతంలో పిడుగు పాటుతో మరొక్కరు మృతి

● ఈ ప్రాంతంలో అలజడి కల్గిస్తున్న దుర్ఘటనలు

● వరుస ఘటనలతో 4కు చేరిన మృతులు



తాండూరు మేజర్ న్యూస్ (మే 20)ః తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని పాత తాండూరు లో సోమవారం నాడు పిడుగు పాటు కు ఒక్కరు బలి అయ్యారు పాత తాండూరు కు చెందిన శేఖర్ (40) పిడుగు పాటు కు మృతి చెందారు సాయంత్రం ఇంటి నుండి బయటకు బయలు దేరిన శేఖర్ వర్షం రావడంతో ఒక్క చెట్టు క్రింద నిల్చొని ఉండగా పిడుగు పాటు కు గురయ్యారు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు మూడు రోజుల క్రితం పిడుగు పాటు కు యాలల మండలంలో ముగ్గురు మృతి చెందిన సంఘటన మరవక ముందే మరో దుర్ఘటన జరగడంతో అందరిలో ఆందోళన వ్యక్తం అవుతుంది.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



కొడంగల్, మేజర్ న్యూస్ (మే 20): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల్ 33 కేవీ ఫీడర్‌పై పోల్ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ కొడంగల్ ఏడీఈ నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. నర్సాపూర్, గుండ్లకుంట, పాత కొడంగల్, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

అదే విధంగా కొడంగల్ మండలంలోని పెద్దనందిగామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పెద్దనందిగామ, చిన్ననందిగామ, ప్యాలమద్ది, హుసేన్‌పూర్, బుర్జుఖాన్‌పల్లి, దౌల్తాబాద్ మండలం నందారం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**IN THE COURT OF THE HON'BLE MACT CUM FAMILY COURT JUDGE AT :: MAHABUBNAGAR**
**O.P. No. 329 of 2020**

Between:
R.Parvathi @ Ramani and others ...Petitioners
And
Gudeti Raghu Shankar Swamy and others ...Respondent

**NOTICE**

To,
1. Gudeti Raghu Shankar S/o Shankaraiah, Aged 42 years, Driver of Hire Bus bearing No.TS07UJ2300, R/o Jinnaram Village, Marikal Mandal, Narayanapet District, now at H.No.B-17/16, Vambay Colony, RGK Complex, Laxmiguda, Mailardevpally, Rajendranagar, Rangareddy Dist.
...Respondent No.1

Take notice that the above O.P. filed for compensation under 166 of M.V.Act 1988, against you and others and it is posted on 26-06-2024 for your appearance, in person or through an advocate, in case you failed to appear before this Hon'ble Court on 26-06-2024 at 10:30 AM, the petition will be decided ex-parte.

**"By the order of the Court"**

**J.RAVI KUMAR**
**Advocate, Mahabubnagar**
**Cell: 9440567616**

## బహిరంగ ప్రకటన

నా క్లాయింట్ సూచన ప్రకారం ఇందుములముగా యావన్మంది ప్రజలకు తెలియచేయునది ఏమనగా నా క్లయింట్‌కి చెందిన ఇట్టి స్థలము ఇంటి నెం. 4-2-28 భగము పడమర దిక్కు స్థలం మొత్తం విస్తీర్ణము 31-0 X 22-2 =686.96 చదరము ఫిట్లు లేద 76.32 చదరపు గజలు లేద 68.82 చదరపు మిటర్లు మరియు పి.టి.ఐ.యన్. నెం. 1058001105, శివరాంనగర్ కాలని, వికారాబాద్ పురపాలిక సంఘము వికారాబాద్ మండలము వికారాబాద్ జిల్లాలో ఉన్నది మరియు దీనికి సరిహద్దులు తూర్పున ఇ నెం. 4-2/281, కలదు పడమరన దారి ఉత్తరన దారి మరియు దక్షినన మంగలి కిష్టాయ్య ఇల్లు కలదు మరియు ఇట్టి స్థలమును నా క్లయింట్ శ్రీ జి. కిషోర్ వారి తండ్రి గారు అయిన శ్రీ ప్రభు అలియస్ ప్రభులింగం వ్రాసియించిన గిఫ్ట్ డిడ్ నెం. 137/2024 తేది 17-02-2024 ద్వార పొందినారు మరియు నా క్లయింట్ పై ఇంటి పై ఎ.యు. స్మల్ ఫైనన్స్ బ్యాంక్ వికారాబాద్ బ్రాంచ్ నందు ఇల్లు కటడానికి ఋణము తీసుకున్నచున్నడు మరియు నా క్లయింట్ తండ్రి గారికి నా క్లయింట్ మరియు ఒక చెల్లి సంగీత ఉన్నారు దీని పై వారసులకు ఏలాంటి అభ్యంతరము లేదు అని తెలియచేయుచున్నము మరియు దీని పై ఏ ఇతరులకు ఏలాంటి అభ్యంతరలు ఉన్నచో వారు క్రింద తెల్పిన చిరునామాకు ఈ ప్రకటన ఇచ్చిన నాటి నుండి 7 రోజులలో మీ అభ్యంతరాలు తెలియజేయగలరు ఆ తరువాత ఎలాంటి అభ్యంతరములు స్వీకరించబడవు.

సం/- **ముక్తార్ అహమ్మద్**
న్యాయవాది
ఇ.నెం.5-3-195/1, శాంతి నగర్, జహీరాబాద్ టౌన్
సంగారెడ్డి జిల్లా. సెల్ నెం. 9948035652

## మానసిక వికలాంగుల కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుండి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



**- వి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య**

మంచాల, మేజర్ న్యూస్ (మే 20) : మానసిక వికలాంగులకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రతి నెల నెల ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వారి కుటుంబాలను ఆదుకోవాలని వి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రములో ఉన్న మనోవికాస కేంద్రములో జశ్వంత్ బాబు అనే మానసిక వికలాంగుడి వుట్టిన రోజు వేడుకలో ముఖ్య అథితిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో దివ్యాంగులను గౌరవించాలని తెలిపారు. మానసికంగా బాదపడుతున్న వారి బాగోగులు చూసుకుంటున్న కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. మండల కేంద్రంలో ఐకేపి ద్వార నిర్వహిస్తున్న మనోవికాస కేంద్రములో 0 -14 సం రాలు గల వికలాంగుల పిల్లలకు చేస్తున్న సేవలు చాల బాగున్నాయని జిల్లాలో ఇలాంటి సేవలు ఎక్కడ లేవని ఐకేపి సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమములో ఎన్ హెచ్ సి సెంటర్ సిబ్బంది స్వరూప,యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

**వెంకట్రావుపేటలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి**





తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (మే 20) : జనహృదయ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు వెంకట్రావుపేట్ గ్రామంలో ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సిపిఎం జెండా ఆవిష్కరణ చేసి సుందరయ్య చిత్రపటానికి పలువురు సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ పాటలు గ్రామ ప్రజలను ఆకర్షించాయి. అనంతరం కామ్రేడ్ కాన్గుల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కె వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు జగన్‌లు హాజరై వారు మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పుట్టింది ధనిక భూస్వామ్య కుటుంబంలో అయినా తన జీవితకాలం అంతా పేద ప్రజల కోసం, దళితులకు సమాన హక్కుల కోసం, సమానత్వం కోసం, అసమానతలు లేని, దోపిడీ పీడనలేని సమాజం కోసం, అహర్నిశలు కృషి చేశారని అన్నారు. కుల వివేక్షతపై పోరాటం ముందుగా తన గ్రామంలో తన ఇంటి నుండే ప్రారంభించారని, దళితులకు గ్రామంలో ఉన్న అంటరాని తనానికి వ్యతిరేకంగా సహపంతి భోజనాలు పెట్టించిన మహోన్నత వ్యక్తి అన్నారు. పిల్లలు పుడితే తన కుటుంబం, తన సంపాదన అనే స్వార్థం ఏర్పడుతుందని తన జీవిత భాగస్వామి లీలాను ఒప్పించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని పెళ్లి చేసుకున్నారని తెలిపారు. నిరుపేదలకు తన స్వంత భూమి 50 ఎకరాలన పంచారని వారు పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మొదటి ప్రధాన కార్యదర్శి గాను, మొదటి ప్రతిపక్ష నాయకుడుగాను, భారతదేశానికి సేవలు అందించిన ధన్యజీవి పుచ్చలపల్లి సుందరయ్యను కొనియాడరు. తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూ పంపిణీ చేయించారని, దోపిడీ, వెట్టి చాకిరి, విముక్తి కోసం నిరంకుశ నిజాం ప్రభుత్వనికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. వ్యవసాయ కార్మికుల కోసం ఉపాధి హామీ పథకం సాధించి పెట్టినటువంటి ఘనత సిపిఎం పార్టీది, నేడు బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీకి తూట్లుపొడిచే విధంగా ఏటేటా బడ్జెట్ తగ్గిస్తూ వస్తుందని బిజెపి ప్రభుత్వ 10 సంవత్సరాల కాలంలో అంబానీ, ఆదానీల లాంటి బడా పెట్టుబడిదారుల ఆస్తులు పెచాయని పేదలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. పది సంవత్సరాల బిజెపి కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో నిత్యవసరాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగావి అని, ప్రతి సంవత్సరం దేశంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చింది లేదన్నారు. విదేశాల్లోని స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనం బయటికి తెచ్చి పేదల ఖాతాల్లో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పిన మోడీ మాటలు నీటి మూటలుగా మారి దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. కులం పేరుతో, మతం పేరుతో, దేశ ప్రజల మధ్యలో చిచ్చు పెట్టి భావోద్వేగాలు రెచ్చగొట్టి దేశాన్ని ఎలాలని చూస్తుందని, మరొకసారి బిజెపి గెలిస్తే ప్రజలకు కష్టాలు తప్పవని అన్నారు. అందుకే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సుందరయ్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు, అంబేద్కర్ పూలే జాతర కమిటీ నాయకులు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి రఘురాములు, కేవిపిఎస్ జిల్లా నాయకులు డి. చెన్నయ్య, జగన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు టి. కిషోర్, డివైఎఫ్ఐ అమంగల్ ఏరియా కమిటీ కార్యదర్శి శివ శంకర్, ఎల్బీనగర్ డివిజన్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ ఆమనగల్ మండల అధ్యక్షులు ఆదర్శ, ఎస్ఎఫ్ఐ తలకొండపల్లి మండల్ నాయకులు టి పవన్, సిపిఎం నాయకులు శ్రీనివాసులు, పిప్పళ్ళ వెంకటయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నానాజీపూర్ పంచాయతీలో ఏసీబీ ఆకస్మిక రైడింగ్




శంషాబాద్, మేజర్‌న్యూస్ (మే 20) : ఒక వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుంటు గ్రామప్చాయతీ కార్యదర్శి, కారోబార్‌లు ఇద్దరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ వుదంతం శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో చోటుచేసుకుంది. నానాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో హైదరాబాద్‌కు చెందిన బర్మత్ అలీకి 500 వందల గజాల స్థలం వున్నది ఆస్థలంలో ప్రహరీ గోడ, ఒక చిన్నరూం నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధికను సప్రదించగా 65 వేల రూపాయలు లంచంగా కావాలనీ.. ఆ డబ్బులు ఇస్తేనే పని చేసుకోవడానికి అనుమతులు ఇస్తామని చెప్పగా కారోబార్ బాలరాజుకు 50 వేలు ఇవ్వాలని చెప్పడంతో బర్మత్ అలీ పంచాయతీ కార్యదర్శి రాధికను ఇంత బడ్బులు నా దగ్గర లేవని చెప్పడంతో చివరిగా 30 వేల రూపాయలు ఇచ్చి పనులు చేసుకోవాలని చెప్పడంతో బాదితులు బర్మత్ అలీ ఏసీబీ అధికారులను సప్రదించాడు, సోమవారం నానాజీపూర్ గ్రామ పంచాయతీ భవనంలో 30 వేల రూపాయల నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ప్రత్యేక్షంగా కార్యదర్శి రాధికను, కారోబార్ బాలరాజును పట్టుకున్నారు. వీరిపై చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో నరేందర్ రెడ్డి



యాచారం మేజర్ న్యూస్ ( మే 20): యాచారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలం లో నీటిని నిలువ ఉండేటట్లు గుంతలు తవ్వాలని కూలీలకు అవగాహన కల్పించారు. రోజు పత్తి కూలి ఎన్ని మీటర్లు లేవలింగు కానీ. గుంతలు గాని కొలతలు తప్పనిసరిగా ఉండాలని కూలీలకు. ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. పత్తి శనివారం మేటి తోటి మస్టర్ లో పేరు. కొలతలను చదివించుకోవాలి. బాధ్యతాయుతంగా కూలీలు పని చేయాలని సూచించారు. కూలీలకు గ్రామపంచాయతీ సిబ్బంది సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ తిరుపతయ్య. ఈజీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
# సత్యానందం జన్మదిన వేడుకలు



చేవెళ్ల, మేజర్ న్యూస్ (మే 20)ఃచేవెళ్ల కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బురాన్ సత్యానందం జన్మదిన వేడుకలను సోమవారం చేవెళ్ల కోర్ట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సత్యానందంతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దళిత వర్గంలో పుట్టి చేవెళ్ల కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎదగడం చాలా సంతోకరమని, సత్యానందం మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజలకు మంచి సేవలు అందించేలా భగవంతుడు ఆయనకు శక్తి ప్రసాదించాలని వారు వేడుకున్నారు. అందరితో ఆప్యాయంగా ఉండే సత్తానందం పది కాలాలపాటు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు బీఆర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బారసోసియేట్ కోశాధికారి తాజోద్దీన్, న్యాయవాదులు చంద్రశేఖర్, ఎల్. జైపాల్, కె కుమార్, డి. సురేందర్,స్నేహితులు సున్నపు రమేష్ తదితరులు ఉన్నారు.



గండిపేట్, మేజర్‌న్యూస్ (మే 20) : తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో గండిపేట్ మండలానికి చెందిన చిన్నారులు పాల్గొన్నారు. భరతనాట్యం చేసిన వారిలో ముంగిరెడ్డి హరిణిరెడ్డి, ముంగిరెడ్డి సిదీక్షరెడ్డి, అడ్డెట్ల హంషిక, అడ్డేట్ల వీణ, కైరం కొండ మమత, కైరంకొండ ప్రవస్థిలు తమ కలను ప్రదర్శించారు. చిన్నారులు తిరుమల తిరుపతి దేవస్థానంలో భరతనాట్యం చేయడంతో గండిపేట్ మండలానికి చెందిన పలువురు ప్రశంసించారు.

# ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

● జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి శంకర్ నాయక్

వికారాబాద్ జిల్లాప్రతినిధి, మేజర్‌న్యూస్ (మే 20)ః ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. సోమవారం ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐఓ మాట్లాడుతూ... పరీక్షలల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సజావుగా జరిగేలా అదికారులందరూ సహకరించాలన్నారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుండి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 నుండి 12 గంటల వరకు అదేవిధంగా రెండవ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహించేందుకు గాను వికారాబాద్ 6, తాండూర్ 4, పరిగి 4 పరీక్ష కేంద్రాలను అదేవిధంగా నవాబ్ పేట్, పెద్దేముల్, మార్పల్లి, మొమిన్ పేట్, దోమ, కొడంగల్, కూల్కచెర్ల మండలాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను కల్పించినట్లు ఆయన తెలిపారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం జనరల్ , ఒకేషనల్ కలిపి 7831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని అన్నారు. మొదటి సంవత్సరం 4621 మంది , రెండవ సంవత్సరం 3210 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్ లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని ఆయన తెలిపారు. పరీక్ష సమయాల్లో నిరంతర విద్యుత్ సౌకర్యం వుండాలని సంబంధిత అధికారికి సూచించారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు. పరీక్ష సమయాలను బట్టి విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను నడిపించాలన్నారు. పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమీక్ష సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ బిక్షు నాయక్, పోస్టల్ అధికారి పద్మారావు, విద్యుత్ శాఖ ఏడి రామచంద్రయ్య, ఆర్డిఓ డిఏఓ గోవిందమ్మ, పోలీస్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, జూనియర్ లెక్చరర్ బుచ్చయ్య, వైద్య ఆరోగ్య శాఖ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు ఎపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలి

● డిఎల్ పీఓ సంధ్యారాణి



మొక్కలను పర్యవేక్షిస్తున్న డిఎల్ పీఓ

కుల్కచర్ల రూరల్,మేజర్ న్యూస్ (మే 20)ఃమొక్కలు ఎపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎల్ పీఓ సంధ్యారాణి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని నర్సరీలో పెరుగుతున్న మొక్కలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మొక్కలకు ఎప్పటికప్పుడు నీళ్లు పోస్తూ ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిచ్చిమొక్కలు పెరిగితే వెంటనే తొలగించాలని, వాచర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీలపై షెడ్‌నెట్లను మొక్కలకు గాలి తగిలేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కరీం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పిడుగు పాటుతో మృతి చెందిన కుటుంబాలకు అండగా నిలిచిన పలు పార్టీల నేతలు

● ఒక్కొక్కరికి పది వేల చొప్పున ఆర్థిక సహాయం చేసిన ముగ్గురు పెద్దలు
● మరింత అండగా ఉంటమన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



ఆర్థిక సహాయం చేస్తున్న రవీందర్ రెడ్డి, తదితరులు

తాండూరు మేజర్ న్యూస్ (మే 20)ః తాండూరు సెగ్మెంట్ యాల ల మండలంలోని జుంటి పల్లీ, బెన్నూర్, గ్రామాలకు చెందిన ముగ్గురు రైతులు పిడుగు పాటు తో ఇటీవల మృతి చెందడంతో వారికీ దౌర్యం కల్పిస్తూ ఆర్థిక సహాయం చేయడానికి వివిధ పార్టీలకు చెందిన పెద్దలు ముందుకు వచ్చారు. ఈ మేరకు సోమవారం నాడు తాండూరు టౌన్ లో నీ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ఒక్కొక్కరికి పది వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. పిడుగు కాటుకు బలైన ముగ్గురికి ఆర్థిక సహాయం చేసారు అలాగే తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తమ పార్టీ నేతల ద్వారా ఒక్కొక్కరికి పది వేల చొప్పున మొత్తం ముప్పై వెలు అందించారు. అలాగే తాండూరు తాజా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తమ పార్టీ కి చెందిన యాలల మండలం బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ కుమార్, నేతలు వెంకటయ్య. లక్ష్మాప్ప, వెంకట్ రెడ్డి, పటేల్ రెడ్డి, శేఖర్, తదితరుల ద్వారా ఒక్కొక్కరికి పది వేల రూపాయల చొప్పున మొత్తం ముప్పై వెల రూపాయాలు వారి వారి గ్రామాలకు వెళ్లి అందజేశారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని వారి వారి కుటుంబాలకు అండగా ఉంటాం అని వారు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ కి చెందిన భీమయ్య, హన్మంతు, సిద్రాలశ్రీనివాస్, రజాక్, రఘు, తదితరులు ఉన్నారు.

# గ్రామంలో మౌలిక వసుతుల కల్పనకు కృషి

## ఎంపీటీసీ చెలిమిల ఆనందం



కుల్కచర్ల రూరల్,మేజర్ న్యూస్ (మే 20)ఃగ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీటీసీ చెలిమిల ఆనందం అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని తాగునీటి సమస్యను తీర్చేందుకు 15 రోజుల నుండి బావి పూడిక పనులు చేపట్టడం జరిగింది. పనులను రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రకళ, భాను, వాటర్ మెన్ యాదయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఫీజుల దోపిడికి కొత్త కొత్త పేర్లతో ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు

● విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
● ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్బీ.గుల్షన్



కొడంగల్, మేజర్ న్యూస్ (మే 20): విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు కొత్త కొత్త పేర్లతో ఫీజుల దోపిడికి ప్రైవేట్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారని ఎంఐఎం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడంగల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలో కొత్త కొత్త పేర్లతో ప్రైవేట్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, పిల్లల తల్లిదండ్రులు నమ్మి మోసపోవద్దన్నారు. హంగు, ఆర్భాటంతో పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలను నమ్మరాదని, ఇంతకు ముందు ఏ పాఠశాలలో తమ పిల్లలు చదువుతున్నారో అదే పాఠశాలలో చదివించాలని కోరారు. ఒకే పాఠశాలలో చదివించడంతో వారి విద్యాభ్యాసం సక్రమంగా కొనసాగేందుకు దోహదపడుతుందన్నారు. కొడంగల్‌లో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం మంచి హోదాల్లో ఉన్నారని, పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారో లేదో తెలుసుకొని విద్యార్థులను చేర్పిస్తే వారి భవిష్యత్‌కు మంచి పునాది లభిస్తుందన్నారు.

# పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

## ఎంపీడీవో రామకృష్ణ నాయక్



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ నాయక్.

కుల్కచర్ల,మేజర్ న్యూస్ (మే20):పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీవో రామకృష్ణ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని ముజాహిద్ పూర్ గ్రామంలో పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల్లో నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

● ఆగస్టు 15న 2 లక్షల రుణమాఫీ
● కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్



మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్

కుల్కచర్ల రూరల్,మేజర్ న్యూస్ (మే 20)ఃరైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేని కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆగస్టు 15 కల్లా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని అన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వం పైన బురదజల్లే ప్రయత్నం చేస్తుంది ఎవరు వారి మాటలను పట్టించుకోవద్దు కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ కావాలని రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారనీ అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్క రైతు కు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ ఆగస్టులో చేస్తుంది. రైతులకు అండగా సీఎం రేవంత్ రెడ్డి వడ్లు కొనుగోలు చేసిన రెండు మూడు రోజులకే రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రజలు ఎవరు కూడా అధ్వర్యంలో కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల నమ్మకం పెంచుకోవాలని చెప్పారు.

# బీజేఎంసీలో బిల్డర్ల భారీ మోసం

- అనుమతులేమో ఇండిపెండెంట్ నిర్మాణాలుగా.. నిర్మాణాలేమో విల్లాలుగా.. - అధికారులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై ముడుపుల కోసం సామాన్యుడిని బలి పశువుని చేస్తున్న వైనం

- తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు - రెట్టింపు లాభంతో క్రయ విక్రయాలు చేస్తున్న బిల్డర్లు



బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

గండిపేట్, మేజర్‌న్యూస్ (మే 20) : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో బిల్డర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు మితిమీరిపోయిన ఉత్సాహంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఏకంగా తిమ్మిని బమ్మి చేసి వారి చేతివాటానికి పదును చూపుతున్నారు. కోట్లల్లో ఆదాయాన్ని ఆర్జించేందుకు అక్రమ మార్గాలను అన్వేషించి అమలు చేస్తున్నారు. అధికారులు సైతం అక్రమాలకు వంత పాడటం బిల్డర్లకు కలిసి వస్తుంది. మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ప్రజలను నమ్మించి అబద్ధపు మాటలు చెప్పి మార్కెట్ ధరకు రెట్టింపు ధరలను చెప్పి ఇళ్లను విక్రయిస్తున్నారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్పోరేషన్ పరిధిలోని యాదాద్రి కాలనీలో ఓ నిర్మాణదారుడు అర ఎకరా స్థలంలో ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నాడు. వాటిని విల్లాలుగా మలిచి సెమి గేటెడ్ కమ్యూనిటీ అని నామకరణం చేశాడు. దీని ద్వారా ఆ ప్రాంతంలో బహిరంగ మార్కెట్లో ఇండిపెండెంట్ నివాసం ధర రూ.1.6 కోట్లు ఉండగా, విల్లాలుగా నిర్మించి రూ.2.49 కోట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇలా చేయడం ద్వారా మొత్తం నివాసాలకు రూ.16 కోట్లు రావాల్సి ఉండగా ఏకంగా రూ.24 కోట్ల వ్యాపారానికి స్కెచ్ వేశాడు. సుమారు రూ.10 కోట్ల మేర లాభాన్ని ఆర్జించేందుకు నిర్మాణదారుడు పన్నాగం పన్నాడు. ఈ పన్నాగానికి ఘనత వహించిన కార్పోరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికంగా వచ్చిన డబ్బులను స్థానిక పేరు మోసిన ప్రజా ప్రతినిధులకు, కార్పోరేషన్ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. స్థానికంగా కొనుగోళ్లు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని, బిల్డర్ల మాయాజాలంలో పడి మోసపోవద్దని సూచించారు. ఈ విషయంపై మున్సిపల్ ఉన్నతాధికారులు దృష్టి సారించి భారీ అవినీతిని బట్టబయలు చేయాలని వారు కోరుతున్నారు.


ఆర్టీఐ యాక్టు కింద దొరికిన సమాచారం

## బీజేఎంసీ గ్రామకంఠం భూములను కాపాడాలి

- కాంగ్రెస్ పార్టీ నాయకులు భోగాల శ్రీకాంత్, దుద్దు ఆకాష్‌లు



గండిపేట్, మేజర్‌న్యూస్ (మే 20) : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని గంధంగూడ గ్రామంలో గ్రామకంఠం భూములను సంరక్షించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు భోగాల శ్రీకాంత్, దుద్దు ఆకాష్‌లు అన్నారు. గ్రామకంఠం భూముల్లో గిరిధరి కన్‌స్ట్రక్షన్ వారు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కార్పోరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా గ్రామకంఠం భూమి 726 గజాల స్థలంలో గిరిధరి కన్‌స్ట్రక్షన్‌సంస్థ రేకుల షెడ్డును ఏర్పాటు చేసి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడానికి రంగం సిద్ధమైందని ఆరోపించారు. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో రూ.5 కోట్లకుపైగానే ఉంటుందని, ఇంత విలువైన స్థలాన్ని కాపాడాలని కార్పోరేషన్ కమిషనర్‌ను కోరామన్నారు. ఈ మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

# పిడుగుపాటు బాధితుడికి ఏఎంసి మాజీ చైర్మన్ ఆర్థిక సహాయం


పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఎద్ల వద్ద బాధిత కుటుంబీకులు ( ఫైల్ )

మాడ్గుల, మేజర్‌న్యూస్ (మే 19): మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామంలో ఈనెల 19న పిడుగుపాటుతో రెండు కాడెద్దులను కోల్పోయిన బాధిత రైతు మహ్మద్ అబ్దుల్ ఖాదర్ కుటుంబాన్ని సోమవారం మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఆమనగల్లు మార్కెట్‌కమిటి మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి పరామర్శించారు. అధైర్యపడవద్దు అండగా వుంటామని, ప్రకృతివైపరీత్యాల విపత్తు కింద ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందేలా చూస్తామని ఆయన అబ్దుల్ ఖాదర్ కుటుంబీకులకు భరోసానిచ్చి తనవంతుగా 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.కె.ఆర్ మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ ఈ దురుగాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజలంతా అప్రమత్తంగా వుండాలని కోరారు. ఉరుములు, మెరుపులతో కూడన వర్షం రాకను గమనించి రైతులు, కూలీలు వ్యవసాయపొలాల్లో చెట్లకింద ఉండకుండ సురక్షితమైన ప్రదేశాలకు చేరుకోవాలని, అదే విధంగా వర్షా కాలంలో నివాస గృహాల సమీపంలోని విద్యుత్ స్థంభాలు , సపోర్ట్ వైర్లకు మూగ జీవాలు, చిన్నారులు తగులకుండ జాగ్రత్త వహించాలని సూచించారు. మాడ్గుల మండలంతో పాటు కల్వకుర్తి నియోజ కవర్గవ్యాప్తంగా పిడుగుపాటుకు గురై మృతిచెందిన , గాయపడ్డ వారి కుటుంబాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకునేలా చూస్తామని భట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.


ఆర్థిక సహాయం వివరాలు వెల్లడిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.కె.ఆర్

## గండిపేట్ మండలంలో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించిన రెవెన్యూ సిబ్బంది



గండిపేట్, మేజర్‌న్యూస్ (మే 20) : గండిపేట్ మండల పరిధిలో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వట్టినాగులపల్లిలో సర్వే నెంబర్ 128 ప్రభుత్వ స్థలంలో అక్రమంగా రెండు ఇళ్లను నిర్మించారు. ఈ విషయం గండిపేట్ తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి సోమవారం ఆర్ఐ విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను జేసీబీల సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గండిపేట్ మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలపై తమ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. కబ్జారాయులు తమ వ్యవహార శైలి మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నల్లమట్టిని తరలించిన వ్యక్తిపై కేసు నమోదు

▶▶ మైనర్ ఇరిగేషన్ శాఖ ఏ.ఇ.ఇ ఫిర్యాదుతో కాసు జోజిరెడ్డిపై కేసు నమోదు జెసిబి వాహనం సీజ్ ▶▶ వివరాలు వెల్లడించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

మాడ్గుల, మేజర్‌న్యూస్ (మే 19): మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామశివారులోని కనకాల చెరువు నుండి అక్రమంగా నల్లమట్టిని తరలించిన ఇర్విన్ గ్రామపంచాయతి రెడ్డిపురం గ్రామానికి చెందిన కాసు జోజిరెడ్డిపై కేసు నమోదుచేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో అక్రమంగా నల్లమట్టిని తరలిస్తూ గాంగ్యానగర్ తాండ సమీపంలో డంప్ చేసి రాత్రిపూట కొత్తబ్రాహ్మణపల్లి సమీపంలోని ఇసుకబట్టీలకు గుట్టుగా తరలిస్తున్నట్లు సూర్య దినపత్రికలో వెలువడిన కథనంతో పాటు పలువురు స్థానిక నాయకులు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా వెలుగులోకి తెచ్చిన విషయం విధితమే. కాగా కనకాల చెరువు నుండి అక్రమంగా మట్టిని తరలించిన కాసు జోజిరెడ్డిపై సోమవారం మైనర్ ఇరిగేషన్‌శాఖ ఏ.ఇ.ఇ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నల్లమట్టి తరలింపుకు వినియోగించిన జెసిబి వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సి.ఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.



# కోర్టు తీర్పుని ధిక్కరించారంటూ

# తహసిల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

- భూ వివాదం ఒక హైడ్రామాగా మారింది
- కోర్టు తీర్పుని ధిక్కరించే అధికారం మీకు ఎక్కడిదని ప్రశ్నించిన భూ బాధితులు



తహసీల్దార్ కార్యాలయంలో బాధితులు.

బషీరాబాద్,మేజర్న్యూస్ (మే 20): బషీరాబాద్ మండలం పరిధిలోని దామర్చేడ్ గ్రామంలో ఒక భూ వివాదం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ మండలం పరిధిలో దామర్చేడ్ గ్రామంలో మన్యమ్మ అనే ఓ మహిళ రైతు కు ముగ్గురు కూతుర్లు. పెద్ద కూతురు లక్ష్మి, రెండవ కూతురు అమృత, మూడో కూతురు శృతిక ఉండగా మానెమ్మకు 9 ఎకరాల 38 గుంటల భూమి ఉన్నది. తల్లి మానెమ్మ ముగ్గురికి వివాహం చేసింది.అయితే రెండవ కూతురు అమృత, అల్లుడు బాలరాజు ,అక్క చెల్లెలు కి తెలియకుండా మానెమ్మ పై ఉన్న భూమి 7 ఎకరాల 20 గుంటల భూమి లో మూడు ఎకరాల 20 గుంటలు భూమి కూతురు అమృత,కి నాలుగు ఎకరాల భూమి అల్లుడు బాలరాజు పై అమ్మినట్టు అక్రమంగా గుట్టు చప్పుడు కాకుండా అమ్మ మానెమ్మ పై ఉన్న భూమిని తమ పేరు మీదికి పట్ట నమోదు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అక్క లక్ష్మి, చెల్లి శృతిక అమ్మతో కలిసి కోర్టును ఆశ్రయించారు. మాకు కూడా మా వాటా ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు.కోర్టులో స్టే తీసుకొని ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నారు.ఏడు ఎకరాల 20 గుంటల భూమి ఇతరులకు అమ్మే ప్రమేయం లేకుండా కోర్టులో బ్లాక్ చేయించారు. 2020 సంవత్సరంలో కోర్టు తీర్పునిస్తూ కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా మూడో వ్యక్తికి భూమి అమ్మే ప్రసక్తి లేదని కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడం జరిగింది. కోర్టు తీర్పుని ధిక్కరించి ఇతరుల మీదకు పట్టా ఎలా చేస్తారని బాధితులు సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు.ఈ విషయంపై తహసీల్దార్ వై. వెంకటేశం మాట్లాడుతూ... బషీరాబాద్ మండలం పరిధిలోని దామర్చేడ్ గ్రామంలో జోగి అమృతమ్మ బాలరాజ్ పేరు నుండి మెతుకు లక్ష్మి కృష్ణమూర్తి 100/అ /1 2.19 ఎకరాల, గుంటలు 100/అ/2 1.1 ఎకరాల గుంటలు.మొత్తం 3.20 గుంటలు జోగి బాలరాజ్ పేరు మీద నుండి వెంకటాపూర్ తండా శివ రెడ్డి పెట్ వికారాబాద్ జిల్లాకు చెందిన సభావత్ బాబు పేరుమీద 94/ఈ/1 02 ఎకరాలు 94/ఈ/2 02 ఎకరాలు మొత్తం 04 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయబడిందన్నారు. సర్వే నంబర్ లో గల భూమి మూడు ఎకరాల 20 గుంటలు సర్వే నంబర్లు గల భూమి నాలుగు ఎకరాల భూమి ఇతరులకు అమ్మడంపై వచ్చిన ఆరోపణాలకు సమాధానం ఇస్తూ ఒక్కసారి స్లాట్ బుక్ చేసినట్లయితే రిజిస్ట్రేషన్ను ఆపే అధికారం ఎవరికి లేదు మేము వచ్చి మూడు నెలలు మాత్రమే అయింది అంతకుముందు కోర్టు ఇచ్చిన తీర్పు మాకు తెలియదు ఒకవేళ అలా జరిగినచో మేము ఎన్నికల విధుల్లో ఉన్నాను డిప్యూటీ తాసిల్దార్ గారు రిజిస్ట్రేషన్ అధికారమా ఆయనకే ఉండేది ఆయన నుంచి ఏమన్నా తప్పు జరిగితే ఎంక్వయిరీ చేయిస్తాం ఫీల్డ్ ఆఫీసర్ని ఆర్ఐని అక్కడికి పంపించి గ్రామస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అప్పటివరకు భూమి పై ఇతరులకు అమ్మినట్లు తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం సమయాన్ని వృధా చేసి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన అన్నారు.



తహసీల్దార్ వెంకటేషం.

## రాకంచెర్ల శ్రీ యోగానంద లక్ష్మి నరసింహా స్వామి బ్రహ్మోత్సవాలు

- భక్తులు-నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయండి
- మాజీ సర్పంచ్,డిసిసి ప్రధాన కార్యదర్శి పెంటయ్య



పూడూరు మేజర్ న్యూస్ (మే 20)ః ఈనెల 22 నుండి శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించ నున్నట్లు మాజీ సర్పంచ్ డిసిసి ప్రధాన కార్యదర్శి పెంటయ్య తెలిపారు మండల పరిధిలోని రాకంచెర్ల గ్రామంలో వెలసిన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని కల్యాణాన్ని తిలకించాలని కోరారు. ఈనెల 22వ తేదీ బుధవారం నుండి 26వ తేదీ ఆదివారం వరకు జాతర ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. వేద పండితులు భీమాచారి రఘురామాచారి సేతు రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భక్తులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని అన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బషీరాబాద్, మేజర్న్యూస్ (మే 20) :బషీరాబాద్ మండలం పరిధిలోని నవాంద్గీ గ్రామంలో ఉరడి నర్సింలు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు.విషయం తెలుసుకున్న తాండూరు మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణ రావు తన అనుచరులతో మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయని అందించారు.

## పిడుగుపాటుకు ఐదు మేకల మృతి

- పరిశీలించిన పశువైద్యాధికారులు డాక్టర్ శ్రీకర్ రెడ్డి



మృతి చెందిన మేకలు

యాలాల మేజర్ న్యూస్ (మే 20)ః పిడుగుపాటుకు గురై ఐదు మేకలు మృతి చెందాయి.హాజీపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హాజీపూర్ గ్రామనికి చెందిన పెద్ద మొగులప్పకు చెందిన మేకలు మేపుకునేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన జల్లులతోపాటు పిడుగు పడటంతో సుమారు రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, యజమాని ద్వారా తెలుసుకున్న యాలాల పశువైద్యాధికారి శ్రీకర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన ప్రమాదంలో బాధిత యజమాని మొగులయ్య తనకు తీవ్ర నష్టం జరిగిందని,పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా యాలాల మండలం ముకుందాపూర్ గ్రామంలో సిరేలి నర్సిములుకు చెందిన ఆవు కరెంట్ సరఫరా జరిగే బుడ్డి దగ్గర కరెంట్ షాక్ తగిలి మృతి చెందింది.



మృతి చెందిన ఆవు.

## ఈ నెల 24న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

### కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త యం.పరమేశ్వర్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్న్యూస్ (మే 20)ః పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష మే 24 న జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త యం.పరమేశ్వర్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024 సంవత్సరానికి ప్రవేశాల కోసం మే 24న (శుక్రవారం) పాలీసెట్ పరీక్ష ఉదయం 11.00 గం. నుండి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష వికారాబాద్ పట్టణంలోని 03 పరీక్షా కేంద్రాలలో నిర్వహిచబడుతుంద ని తెలిపారు. ఈ పరీక్షకు వికారాబాద్ జిల్లాకు చెందిన 1321 అభ్యర్థులు అందులో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, కొంపల్లిలో 240 మంది, భృంగి ఇంటర్నేషనల్ స్కూల్, ఎన్నెపల్లి లో 600 మంది, శ్రీ అనంత పద్మనాభ డిగ్రీ కళాశాల, వికారాబాద్ లో481 మంది హాజరు అవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు . అభ్యర్థులు అందరు ఉదయం పది గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 11 గంటలు దాటిన తరువాత ఒక్క నిమిషం అలస్యంగా వచ్చిన పరీక్ష వ్రాయడానికి అనుమతించబడదన్నారు. అభ్యర్థులు అందరు హల్ టికెట్ లు తీసుకొని పరీక్షకు హాజరు కావాలని, పరీక్షా వ్రాసే విద్యార్థులు అందరూ తప్పక తమ వెంట పెన్నులు, పెన్సిలు, ఎరేజర్ తీసుకొని పరీక్షకు నిర్ణిత సమయంలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

## గాలి వాన బీభత్సం





బషీరాబాద్, మేజర్న్యూస్ ( మే 20) :బషీరాబాద్ మండలం వ్యాప్తంగా సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. భయంకరమైన గాలులు, ఉరుములు, మెరుపులతో మండల ప్రజలను వరుణుడు వణికించాడు.పలు గ్రామాలలో విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడడంతో విద్యుత్ కి అంతరాయం ఏర్పాడింది.భారీ వర్షం కురవడంతో అక్కడక్కడ రాకపోకలకు ఇబ్బంది కలిగింది.ఉదయం నుంచి మధ్యాహ్నం సమయం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు భయంకరమైన గాలులు వర్షంతో ప్రజలు ఒక్కసారి కి భయంతో ఆందోళన గురయ్యారు.

## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యం

- కో ఆప్షన్ జిల్లా అధ్యక్షులు అక్బర్ బాబా



యాలాల మేజర్ న్యూస్ (మే 20)ః మండలం కేంద్రంలో అభివృద్ధి పరుగులు పెట్టాలంటే తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి తోనే సాధ్యమని జిల్లా కోఆప్షన్స్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా అన్నారు. యాలాల కేంద్రంలో బీసీ కాలనీలో సైడ్ డ్రెన్ పనులను ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తామని తెలియజేశారు.

# అవిశ్వాసం నెగ్గలేక అనైతిక రాజకీయాలు

- తన స్వార్థ రాజకీయాల కోసం అమర్ సింగ్‌ను ఆడిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
- ఖర్చు పెట్టిన డబ్బుల కోసం అమర్ సింగ్ హైడ్రామా
- బీఆర్ఎస్ పార్టీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రఘువర్ధన్ రెడ్డి

మేడిపల్లి మేజర్ న్యూస్ (మే 20): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పెట్టిన అవిశ్వాసం నెగ్గలేకనే మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు సుదీర్ రెడ్డి అనైతిక రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సుధీరన్ రెడ్డి స్వార్థం కోసం అమర్ సింగ్ ను పావుగా వాడుకొని క్యాంపుల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టించాడని అన్నారు. అయితే పెట్టిన డబ్బులు బూడిదలో పోసిన పన్నీరు అవుతుందనే ఉద్దేశ్యంతోనే అమర్ సింగ్ హత్యా రాజకియాలకు పాల్పడుతున్నారన్నారు ఆరోపించారు. తమ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై, మద్దతుగా ఉన్న కార్పోరేటర్లపై సుమారు 25 కార్లలో తీసుకువచ్చిన ప్రైవేటు గుండాలతో దాడులు చేయించి హత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఈ క్రమంలోనే ఔటర్ రింగు రోడ్డు పై అమర్ సింగ్ తీసుకువచ్చిన ప్రైవేటు వ్యక్తులు కొందరు కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలపై పోలీసులు కేసు నమోదు చేస్తారని తెలియడంతో హస్పిటల్ పేరుతో హైడ్రామా చేస్తున్నారని ఎద్దేవ చేశారు. సుదీర్ రెడ్డి కనుసన్నల్లో జరుగుతున్న ఈ వ్యవహారంలో అమర్ సింగ్ బలి పశువు అవుతాడని రఘువర్ధన్ రెడ్డి జోస్యం చెప్పారు.

**గెలవ లేక గోల పెడుతున్నారు...**

మేయర్ వెంకట్ రెడ్డి మున్సిపల్ చట్టం నిబంధనలకు లోబడి తన బలంను నిరూపించుకునేందుకు తానే అవిశ్వాసం పెట్టారని, జూన్ 5వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టర్ తేదీ ఇవ్వడంతో ఎలాగు గెలువలేమనే భావం తో కాంగ్రెస్ నాయకులు గోల చేస్తున్నారని రఘు వర్ధన్ రెడ్డి మండి పడ్డారు. సుదీర్ రెడ్డి ప్రలోభాలకు లొంగక పోవడంతో మా నాయకుడు వెంకట్ రెడ్డితో పాటు అతనికి మద్దతుగా ఉన్న కార్పోరేటర్లపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. అమర్ సింగ్ అండ్ కో, కాంగ్రెస్ పెయిడ్ గ్యాంగ్ ఔటర్ రింగు రోడ్డుపై చేసిన హంగామా అంతా సీసీ టీవీ కెమెరాలతో దొరుకుతుందని ముందే వెళ్లి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ లో మేయర్,ఆయనకు మద్దతుగా ఉన్న కార్పొరేటర్ల పై తననే కిడ్నప్ చేయాలని ప్రయత్నించారని పిర్యాదు చేయడం దొంగే.....దొంగ దొంగ అన్నట్లుగా ఉందన్నారు.

**ఘట్ కేసర్ పోలీసులకు ఫిర్యాదు...**

ఆదివారం రాత్రి 7.30 నిలకు బిఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ల పై దాడి మరియు కిడ్నప్ యత్నం సంఘటనపై ఘట్కేసర్ పోలిస్ స్టేషన్ లో పీర్జాదిగూడ కార్పొరేషన్ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి సదరు వ్యక్తి అమర్సింగ్ అతని అనుచరుల పైన పిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని తెలిపారు. దాడులు చేసి ప్రలోభాలకు గురించే, బెదిరించి గద్దెనెక్కాలని ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రానున్న రోజులలో ప్రజలే బుద్ధి చెబుతారు. కొందరి కాంగ్రెస్ పెద్దల చేతిలో పావుగా మారి అమర్ సింగ్ తన రాజకీయ భవిష్యత్తును ఆగం చేసుకుంటున్నాడన్నారు.

విలేకరుల సమావేశంలో డివిజన్ల అధ్యక్షులు జావీద్ ఖాన్,ఆంజనేయులు, బాలరాజు, కిర ణ్, యాసారం శ్రీనివాస్, జోగి రెడ్డి,యూత్ అధ్యక్షులు ఫైళ్ల ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు మనోరంజన్ రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.



ఘట్కేసర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసిన బి ఆర్ ఎస్ నేతలు

# ఢిల్లీలోని తెలుగు ప్రజలు బీజేపీకి ఓటు వేయాలి

- బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు టి.సధానంద రెడ్డి,కౌన్సిలర్ టి.శ్రీదేవి
- ఢిల్లీలో ఎన్నికల ప్రచారం



ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం.



వికారాబాద్,మేజర్‌న్యూస్(మే20):పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఢిల్లీలో నివాసమున్న తెలుగు ప్రజలను బిజెపికి ఓటు వేయవలసిందిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు టి.సదానంద రెడ్డి, వికారాబాద్ కౌన్సిలర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు టి.శ్రీదేవి రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఢిల్లీలోని కరోల్ బాగ్, సుల్తాన్పురి, జిల్మిల్, రంగాపురి, గోపాల్పురి, మహిపాల్పు రి, మయూర్ విహార్‌లో నివాసముంటున్న తెలుగు ప్రజలను కలిసి భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. గత పది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు దేశ రక్షణ విషయం లో అనేక చర్యలు చేపట్టారని తెలిపారు. స్థానికంగా వారికి ఉన్న సమస్యలను తెలుగు సెల్ బిజెపి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఢిల్లీలోని ఏడు పార్లమెంటు సీట్లను భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకుంటుందని, ఈ ఎన్నికలలో 400 సీట్లు దాటుతాయని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు నూనె బాలరాజు, రాష్ట్ర నాయకులు అమరనాథ్ సారంగి, జాజుల గౌరీ, కొమ్మిడి శోభా రెడ్డి, అఫ్సర్ భాషా, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బాదిత కుటుంబాన్ని పరామర్శించిన స్వప్న భాస్కర్‌రెడ్డి

తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (మే 20) : చెన్నారం గ్రామాం నాగోజు ఆచారి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందడం జరిగిం ది. నాగోజు ఆచారి మృతి విషం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న చెన్నారం గ్రామ మాజీ సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి సోమవారం బాదిత కుటుంబాన్ని పరామర్శించి మృతుని దహన సంస్కారాల ఖర్చుల నిమాత్తం తన వంతు సహకారంగా 3వేల రూపాయలు ఆర్థిక సాయం అందజే యడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేష్ నాయక్, రాములు, బుచ్చిరెడ్డి, షేక్ బాబా, చంద్య నాయక్, నరసింహ, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పిడుగు పాటుతో మరణించిన కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

- బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : మాజీ మంత్రి



బాధిత కుటుంబాలను పరామర్శించి పట్నం

తాండూరు మేజర్ న్యూస్ (మే 20): పిడుగు పాటుతొ మరణించిన కుటుంబాల ను అన్నీ రకాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం తో పాటు పార్టీ పరంగా ఆదుకుంటాం అని ఆయన అన్నారు పిడుగు పాటు తో మృతి చెంది తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నా మృతు దేహాలను సోమవారం నాడు చూసి వారి వారి కుటుంబ సభ్యుల తో మాట్లాడి సంతాపం తెలిపి పరామర్శించారు. పిడుగు పాటు తో రైతులు మరణించడం చాలా బాధాకరం అని ఆయన అన్నారు. ప్రభుత్వ పరంగా అందే ఆర్థిక సహాయంను వెంటనే అందించాలని తాండూరు. ఆర్డీవో శ్రీనివాస్ రావును ఫోన్‌లో మాట్లాడుతూ చెప్పారు. ప్రభుత్వ పెద్దలలో మాట్లాడి మరింత ఆర్థిక సహాయం అందే విధంగా చూస్తా అని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. పట్నం మహేందర్ రెడ్డి వెంట నేతలు సిద్రాల శ్రీనివాస్, అబ్దుల్ రజాక్, రఘు అశోక్ ముదిరాజ్, జగ్గు, సిద్దు తదితరులు ఉన్నారు.

# బాలాపూర్ రెవెన్యూ మండలాన్ని బడంగ్ పేటకు మార్చే కుట్ర

- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ సింగిల్ విండో ఛైర్మన్ కోలన్ శంకర్ రెడ్డి



బాలాపూర్ మేజర్ న్యూస్( మే 20):బాలాపూర్ మండల రెవెన్యూ కార్యాలయాని బడంగ్పేట్ కు మార్చే కుట్రలు జరుగుతున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ సింగిల్ విండో ఛైర్మన్ ఆరోపించారు. సోమవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ బాలాపూర్ మండల కేంద్రాన్ని బడంగ్పేట్ కు తరలించే కుట్రలు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్వో కార్యాలయాన్ని తరలిస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. స్థానిక శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఇందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని డిమాండ్ చేశారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి బాలాపూర్ గ్రామ ప్రజల అభివృద్ధిని అణిచివేసే కుట్ర జరుగుతుందని అన్నారు. మరిన్ని కార్యాలయాలు రావలసింది పోయి ఉన్నవే తొలగించే చర్యలు జరిగితే ప్రజలు సహించరని కోలన్ శంకర్ రెడ్డి అన్నారు.

# గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

- మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి



బాలాపూర్ మేజర్ న్యూస్( మే 20):మలేషియాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ రాష్ట్రం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామవాసి రామోజీ రాజేశ్వర చారి బంగారు పథకం సాధించిన సందర్భంగా మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి అభినందించారు. ఈ నెల (10వ , 11వ , 12వ) తారీకులలో 3 రోజులు మలేషియాలో జరిగిన కరాటే పోటీలలో దాదాపు 16 మెడల్స్ రావడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని మంచి ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందే విధంగా తోడ్పడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ సంపత్ కుమార్, టీమ్ మెంబర్స్ కళ్యాణమోహన్, మరియు బిసి ఫెడరేషన్ కులాలు మహేశ్వరం ఇన్చార్జి వడ్రోజు రవీంద్ర చారి, స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణాచారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పార్కు స్థలం కాపాడాలని డీఎల్పీఓకు వినతి



ఘట్కేసర్, మేజర్ న్యూస్(మే, 20): పార్కుస్థలం కాపాడాలని అవుశాపూర్ గ్రామస్తులు సోమవారం డీఎల్పీవో సాంబిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అవుషాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 253, 255, 256, 257, 261, 262, 263, 264 లో దాదాపు 70 ఎకరాల్లో 1985లో 600 ప్లాటు చేశారు. న్యూనిటి పేరుతో మూడు సెక్టార్లలో వెంచర్ చేశారు. వెంచర్ చేసిన సమయంలో పబ్లిక్ ప్లే గ్రౌండ్ (పబ్లిక్ పార్కు) కోసం 2400 గజాల స్థలాన్ని వదిలిపెట్టారు. పంచాయతీ అధికారులు పార్కుస్థలంలో హరితహరం మొక్కలు నాటి బోర్డు ఏర్పాటు చేసి చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

కాగా పార్కును 2016లో విజయ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. విజయ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహకుడు రాజు ఆదివారం తాను కొనుగోలు చేసిన స్థలాన్ని చదును చేస్తుండటంతో స్థానికులు అడుకున్నారు. దీంతో సోమవారం అవుషాపూర్ గ్రామానికి చెందిన పన్నాల కొండల్ రెడ్డి, బిక్షపతిగౌడ్, సందీప్ రెడ్డి, మేడబోయిన జంగయ్య, వామన్ రెడ్డి, వీరేషం, శ్రీనివాస్ గౌడ్, దయాకర్ రెడ్డి తదితరులు పార్కు స్థలాన్ని కాపాడాలని డీఎల్పీవో సాంబి రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

# పిడుగుపాటుకు వ్యక్తి మృతి



కొడంగల్, మేజర్ న్యూస్ (మే 20): కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామంలో పిడుగుపాటుతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆర్ఐ రాఘవేందర్, తోటి కూలీలు తెలిపిన వివరాల మేరకు రుద్రారం గ్రామానికి చెందిన పట్లోళ్ల అపర్ణకు చెందిన సర్వే నెం.508లో పొలం చుట్టు ఫెన్సింగ్ చేసేందుకు వచ్చిన కూలీలతో రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జాపాల్ గ్రామానికి చెందిన దొంతరమోని భగవవంతు ఫెన్సింగ్ పనులు చేస్తుండగా ఆదివారం రాత్రి వర్షం కురుస్తుండగా ఒక్కసారిగా పొలంలో పిడుగు పడటంతో భగవంతు కిందపడిపోయాడు. గమనించిన తోటి కూలీలు, స్థానికులు భగవంతును కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఆర్ఐ రాఘవేందర్ సోమవారం రుద్రారం గ్రామానికి చేరుకొని పంచనామ నిర్వహించి తహసీల్దార్‌కు నివేదిక అందించారు. ఇదీలా ఉండగా మృతుడి తల్లి తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలకిషన్ తెలిపారు.

# మృతుడి కుటుంబానికి అండగా...



శామీర్‌పేట, మేజర్ న్యూస్ (మే, 20) : హఠాన్మరణం చెందిన మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందించాలనే దృక్ప థంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రంలోని మూడు చింతలపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ సోమవారం ఉదయం హఠాన్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన మాజీ వార్డు సభ్యుడు కాంగ్రెస్ నాయకుడు రాజేందర్ ప్రసాద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జెర్రిపోతుల నరసింహులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్ళగా ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిసింది.. వెంటనే చేరో రూ .5 వేల చొప్పున రూ .10 వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బి. నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

## జిల్లా కన్వీనర్, ఐటిఐ ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (మే 20): ఐటిఐ కోర్సులలో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా కన్వీనర్, ఐటిఐ ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు తెలిపారు. ఐటిఐ మొదటి విడత అడ్మిషన్స్ కొరకు వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కోర్సులలో 2024-25/26(1సంవత్సరం మరియు 2 సంవత్సరం) విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో చేరేందుకు విద్యార్థిని, విద్యార్థుల నుండి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు https://iti.Telangana.gov.in వెబ్సైట్ నందు ఆన్లైన్‌లో మే 21 నుండి జూన్ 16 వరకు దరఖాస్తు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సదా అవకాశాన్ని ఆసక్తిగల 10వ తరగతి, 8వ తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోగలరని ఆయన తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్సైట్ నందు అప్లోడ్ చేయవలసిందిగా ఆయన తెలిపారు. మరిన్ని వివరముల కోసం 9177472488 / 8555865421 నెంబర్లను సంప్రదించవలసిందిగా ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




ఘట్కేసర్, మేజర్ న్యూస్(మే, 20):
ఘట్కేసర్‌లోని ది ఘట్కేసర్ మోడల్ హై స్కూల్ 1998-99 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘట్కేసర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా, ఉద్యోగాల కారణంగా దూరమైన బాల్య మిత్రులను కలిసి తమ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన కరస్పాండెంట్ రాజశ్రీ, ఇతర ఉపాధ్యాయులను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు చేయూత ఎమ్మెల్యే



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

యాలాల్, మేజర్‌న్యూస్ (మే 20): పిడుగుపాటుతో అకాల మరణంతో మృతి చెందిన యాలాల్ మండలంలోని బెన్నూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య, జుంటుపల్లి గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్, కొనింటి లక్ష్మప్ప ఈ విషయం తెలుసుకొని వారి కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాలతో ఒక్కొక్క కుటుంబానికి 10 వేల రూపాయల చొప్పున 30 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని యాలాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, యాలాల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, సంగెం హన్మంత్ ముదిరాజ్, సీనియర్ నాయకులు, తిమ్మయిపల్లి భీమయ్య, మహిపాల్, వికాస్ జోషి జుంటుపల్లి కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షులు విజయ్ కుమార్,పృథ్వి రాజ్ గౌడ్, నవీన్ గౌడ్,మంగలి కాశప్ప,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించుటకు నేడే ఆకరి గడువు

## ● డిఐఓ శంకర్ నాయక్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (మే 20): ఇంటర్మీడియట్ సప్లీమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 21 వ తేదీ వరకు పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు చ జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎన్. శంకర్ తెలిపారు. సప్లీమెంటరీ పరీక్షలకు సంబంధిత కళాశాల లో 2 వేల రూపాయల ఆలస్య రుసుంతో చెల్లించ వచ్చునని ఆయన తెలిపారు. విద్యార్థులు వారి తల్లి దండ్రులు, కళాశాలల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇంతకు ముందు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# సింగాపూర్ టౌన్ షిప్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

ఘట్ కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (మే 20) : సింగాపూర్ టౌన్ షిప్ సబే స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ, రాజీవ్ గృహకల్ప కాలనీ, పోచారం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ లైన్ల నిర్వాహణ మరమ్మత్తులతో నేడు విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఏఈ వి. ప్రదీప్ కుమార్ కోరారు. ఇన్నోజిగూడ 11 కెవి ఫీడర్ పరిధిలోని అన్నోజిగూడ, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, ఎల్ఐజి కాలనీ, జైపురి కాలనీ, సత్యనగర్ కాలనీ, సాయి నగర్ కాలనీ, ఇందిర నగర్ కాలనీ, పాత గ్రామంలోని ఉదయం 10 గంటల నుండి మధ్యాహనం 12 గంటల వరకు చెట్ల కొమ్మలు తొలిగింపు. విద్యుత్ లైన్ల మరమ్మత్తులతో విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. మధ్యాహనం 12 గంటల నుండి 2 గంటల వరకు రాజీవ్ గృహకల్ప కాలనీ 11 కెవి ఫీడర్ పరిధిలోని ఆర్ జి కె బ్లాక్స్, ఆర్ఎస్ఆర్‌హైట్స్, మయూరి డెవలపర్స్, సాయి నగర్, ఎమ్రాల్డ్ హైట్స్, సూర్య నగర్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహనం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోచారం 11 కెవి ఫీడర్ పరిధిలోని పోచారం గ్రామం, డాక్టర్స్ కాలనీ, విజయసాయి ఎంక్లేవ్ ప్రాంతాలలో విద్యుత్‌అంతరాయం ఉంటుందని, పై ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

# వృద్దురాలి అంత్యక్రియలకు ఎస్కేఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం.

మర్పల్లి,మేజర్‌న్యూస్(మే20):
మర్పల్లి మండల పరిధిలోని మల్లికార్జున గిరి గ్రామంలో పెద్దింటి భూమమ్మ మృతి చెందింది.గ్రామస్తుల ద్వారా అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి భూమమ్మ అంత్యక్రియలకు 5 వేల రూపాయలు పంపగా స్థానిక నాయకులు మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్కేఆర్ పంపిన నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులున్నారు.

# పిడుగు పాటుకు గేదె మృతి



దౌల్తాబాద్ మేజర్ న్యూస్ (మే 20):ండలం లోని తిమ్మారెడ్డి పల్లి అనుసంధానం అయినా బంగ్లా తండా లో పిడుగు పడి గేదె మృతి చెందింది.లక్ష్మ నాయక్ కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. ప్రభు త్వం వెంటనే ఆదు కోవాలని కోరారు. సుమారు లక్ష రూపాయలు నష్టం కలిగింది తెలిపారు.

# ఎఫ్ఎస్ సిఎస్ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి

ఘట్కేసర్, మేజర్ న్యూస్(మే, 20):ఘట్కేసర్ రైతు సేవా సహకార సంఘంలో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి మాత్రమే డిపాల్టర్ అని ఆ సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి తెలిపారు. సంఘంలో రుణం తీసుకుని చెల్లించని ఆ సంఘం డైరెక్టర్లు ధర్మారెడ్డి లక్ష్మమ్మ, బాల్ రాజ్, వెంకటేష్ లకు నోటీసులు ఇవ్వగా ధర్మారెడ్డి మినహా మిగతా డైరెక్టర్లు మొత్తం బకాయిలు చెల్లించారని, ధర్మారెడ్డి రూ.3,99,600/- లు ఇంకా కట్టలేదని తెలిపారు.